కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసరావు

మలక్‌పేట: లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించి కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలని అవంతి విద్యా సంస్థల ఫౌండర్ చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మూసారంబాగ్ అవంతి డిగ్రీ, పీజీ కాలేజీలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు సోమవారం 'విద్యారంభ' పేరుతో నిర్వహించిన ఓరియంటేషన్ డే ప్రోగామ్‌ను ఆయన పోస్టల్ ఖాతాలు మాజీ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, ఉస్మానియా యూనివర్సిటీ అకాడమిక్ ఆడిట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనాథ్‌రెడ్డి, రామకృష్ణ మఠం బ్రహ్మచారి శ్యామ్ మహారాజ్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ.. టెక్నాలజీ, కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. కుటుంబ వ్యవస్థకు కాపాడుకోవాల్సిన బాధ్యత యువతరంపై ఉందన్నారు. తల్లిదండ్రులు, దేశం, రాష్ట్రం, ఊరు గర్వించేలా ఎదగాలని, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఎండీ శ్రవణ్‌కుమార్, హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, అడ్మిన్ ఇన్‌చార్జి మోహన్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన



సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీజేపీ నాయకులు

మలక్‌పేట: బీజేపీ సభ్యత్వ నమోదుకు అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అంజయ్య యాదవ్ అన్నారు. భాగ్యనగర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మడిగల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మలక్‌పేటలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కిసాన్ మోర్చా జిల్లా ఇన్‌చార్జి మాధవరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సండడి సురేందర్‌రెడ్డి, మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి హాజరై సభ్యత్వ నమోదును ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాంకోటేశ్వర్‌రావు, వంజరి వినోద్, లింగాల హరిగౌడ్, పార్టీ జిల్లా కోశాధికారి రమేష్‌రెడి, సురేందర్, దినేష్, మంజులారెడ్డి పాల్గొన్నారు.

బీసీ ముఖ్యమంత్రి లక్ష్యమే ఎజెండా



మాట్లాడుతున్న నల్ల సూర్య ప్రకాష్

నాగోలు: బీసీ ముఖ్యమంత్రి లక్ష్యమే ఎజెండా అని, బహుజనుల రాజ్యాధికార సాధన దిశగా ఫిబ్రవరిలో బీఎల్‌ఎఫ్ ఆధ్వర్యంలో జరిగే లక్ష మంది బహుజన బహిరంగ సభను జయప్రదం చేయాలని చైర్మన్ నల్ల సూర్య ప్రకాష్ పిలుపునిచ్చారు. కొత్తపేటలోని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యాలయంలో కొప్పు యాదయ్య అధ్యక్షతన జరిగిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాయకత్వ సమావేశానికి నల్ల సూర్యప్రకాష్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లు, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పాలిస్తోందన్నారు. గత పదేళ్లుగా దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం పాలన చూసిన దళిత, బహుజన ప్రజలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల పరిపాలనపై తెలంగాణ రాష్ట్రంలో విశ్వాసం కోల్పోయి ఉన్నారన్నారు. పాండురంగాచారి మాట్లాడుతూ.. దేశంలో స్వాతంత్ర పోరాటం, తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం జరిగాయని ఇక జరగాల్సింది బహుజనుల రాజ్యాధికార పోరాటమేనని దీనికి పరిష్కారం బీసీ ముఖ్యమంత్రే అంతిమ లక్ష్యమన్నారు. ఫిబ్రవరి నెలలో జరిగే లక్ష మంది బహిరంగ సభకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఇంటికో మనిషి ఊరుకో బండి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సుధాకర్, వాసు కే. యాదవ్, మారోజు సునీల్ కుమార్, జంగయ్య ముదిరాజ్, పండరీనాథ్ నేత, రాములు, వెంకటస్వామి గౌడ్, బొడ్డుపల్లి కోటేశ్వర చారి, వడ్ల అరుణ, రవికుమార్, రాజేశ్వరరావు, ధర్మాచారి, ఉమాదేవి పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మార్నింగ్ వాక్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో బొమ్మలగుడి ఎదురుగా ఉన్న రోడ్డులో జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌తో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. బొమ్మలగుడి నుంచి ప్రధాన రహదారి ఇరువైపులా రోడ్డు కుంచించుకుపోయిందని రెండు వైపులా విద్యుత్ స్తంభాలు ఉన్నాయని వాటిని ఒకవైపునకు మార్చాలని ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురయ్యాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. లక్ష్మీభవాని కాలనీ, సిరిహిల్స్, వినాయకనగర్, పవన్‌గిరి కాలనీ, రాజరాజేశ్వరి కాలనీ, వీరన్నగుట్టలో పర్యటించి అక్కడ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హేమంత్ పాటిల్ మాట్లాడుతూ.. ఆయా సమస్యలపై సంబంధించిన అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే వెంట డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, జగదీష్ యాదవ్, అనిల్ కుమార్, చంద్రారెడ్డి అధికారులు శ్రీనివాసరావు, పుణ్య నాయక్, రంజిత్, ఆశలత,కృష్ణ కుమారి, నీలిమ, అన్నపూర్ణ, యాదగిరి ఉన్నారు.

ఇంకుడు గుంత.. ఉండాలి పక్కా!

- 90 రోజుల కార్యాచరణలో ఇంటింటి సర్వే
- జనవరిలోగా నిర్మించుకోవాలని ఆదేశాలు



ఇంకుడు గుంతలు లేని యజమానులకు నోటీసులు ఇస్తున్న డీజీఎం

చాదర్‌ఘాట్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూగర్భ జలాలు పడిపోకుండా జలమండలి ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించి అమలుకు కసరత్తులు చేస్తోంది. ప్రతి ఇంట్లో తప్పని సరిగా ఇంకుడు గుంత నిర్మించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఈ నెల 2వ తేదీ నుంచి డిసెంబర్ 31 వరకు 90 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపడుతుంది. అధికారులు ఇంటింటికి తిరుగుతూ ఇంకుడు గుంతల ప్రయోజనాపై ప్రజలకు వివరిస్తున్నారు. మరోవైపు ఇంకుడు గుంతలు లేని ఇళ్లను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నారు. జలమండలి డివిజన్-1 మలక్‌పేట పరిధిలోకి వచ్చే మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్, సైదాబాద్ డివిజన్ల పరిధిలోని రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ద్వారా ఎన్‌జీఓలు ఈ సర్వే పూర్తి చేశారు. డివిజన్-1 పరిధిలో 300 గజాల్లో నిర్మించిన నివాసాలు, అపార్ట్‌మెంట్లలో ఇంకుడు గుంతలు ఉన్నాయో లేదో ఈ సర్వే ద్వారా గుర్తిస్తున్నారు. డివిజన్-1 పరిధిలో 300 గజాలకు పైగా నివాసాలు, 4272 అపార్ట్‌మెంట్లు ఉన్నట్లుగా గుర్తించారు.

నోటీసులిస్తూ.. అవగాహన కల్పిస్తూ..

2274 నివాసాలకు ఇంకుడు గుంతలు లేవని సర్వేలో తేలింది. ఇంకుడు గుంతలు లేని ఇళ్లకు నోటీసులు ఇచ్చి అవగాహన కల్పిస్తున్నారు. వీరంతా జనవరిలోగా తమ తమ ఇంటి ఆవరణలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచిస్తున్నారు. భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా 90 రోజుల ప్రత్యేక కార్యచరణను అమలు చేస్తున్నామని డీజీఎం సయ్యద్ హస్మత్ అలీ వెల్లడించారు.డిసెంబర్ 31 వరకు ఈ ప్రణాళిక కొనసాగిస్తామని ఇప్పటికి మా పరిధిలో 300 గజాల నివాసాల్లో ఇంకుడు గుంతలు లేని వాటిని గుర్తించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇంకుడు గుంతలు నిర్మించుకోని వారికి ఉచితంగా సాంకేతిక సిబ్బంది పంపించి అవగాహన కల్పిస్తున్నామన్నారు.

రూ.కోట్లల్లో నిధులు.. నాసిరకం పనులు!

- నాగార్జునసాగర్ రోడ్డుపై డివైడర్ల నిర్మాణాల్లో కొరవడిన నాణ్యత
- క్యూరింగ్ లేకుండనే పనులు పూర్తి
- ఫీటులోతు తీయాల్సింది, నాలుగించులకే పరిమితం



నాగార్జున సాగర్ రోడ్డుపై నిర్మించిన డివైడర్‌కు క్యూరింగ్ చేయని దృశ్యం

హస్తినాపురం: రూ.కోట్లు ఖర్చుచేసి నిర్మిస్తున్న డివైడర్ల నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదు. ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం డివిజన్ నాగార్జునసాగర్ రహదారిపై టీకేఆర్ కమాన్ నుంచి నందనవనం మీదుగా టీకేఆర్ కాలేజీ వరకు 400 మీటర్ల డివైడర్ నిర్మాణానికి రూ.55 లక్షలు, సాగర్ రింగ్ రోడ్డు నుంచి బీఎన్ రెడ్డి నగర్ సంతోష్ స్వీట్ హౌస్ వరకు 1.4 కిలో మీటర్ల రోడ్డు డివైడర్ నిర్మాణం కోసం రూ. 1.50 కోట్లతో చేపడుతున్న డివైడర్ల నిర్మాణంలో ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని ఆయా కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ పనులు ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ పనులను పర్యవేక్షించాల్సిన జీహెచ్‌ఎంసీ, ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతూ ప్రజాధనం వృథా చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కానరాని పర్యవేక్షణ..

ఓ వైపు నాణ్యత లేకుండా పనులు చేపట్టి, మరో వైపు తూతూ మంత్రంగా క్యూరింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోజుకు రెండు సార్లు ఉదయం సాయంత్రం వాటర్ క్యూరింగ్ చేయాల్సి ఉండగా బాక్సులు తీసిన వెంటనే ఎలాంటి క్యూరింగ్ లేకుండానే పెయింటింగ్ వేస్తున్నారని, కొన్ని ప్రాంతాల్లో డివైడర్‌లపై బస్తాలు వేస్తూ, మరికొన్ని ప్రాంతాలలో బస్తాలు వేసి క్యూరింగ్ చేస్తున్నట్లు నమ్మించేందుకు రోడ్డు పక్కన డివైడర్ అనుకుని కుప్పలు తెప్పలుగా గోనె సంచులు వేస్తున్నారే తప్ప క్యూరింగ్ చేయడం లేదు. ఈ డివైడర్‌లకు దాదాపు ఫీటు లోతులో నుంచి ఐరన్ రాడ్‌లను వేయాల్సి ఉండగా కేవలం 3-4 ఇంచుల లోతు వరకే వేస్తున్నారన్నారు. హస్తినాపురం చౌరస్తా దగ్గర ఉన్న సిగ్నల్ దగ్గర కేవలం 2 ఇంచల లోతులోనే ఐరన్ రాడ్లను బిగించినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రూ. కోట్లు ఖర్చుచేసి నిర్మిస్తున్న డివైడర్లు కొన్ని రోజులకే పరిమితమయ్యే అవకాశం ఉంటుందని, అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని కోరుతున్నారు.



హస్తినాపురం సిగ్నల్ వద్ద రోడ్డుమీదనే వేస్తున్న ఇనుప చువ్వలు

"ఉన్నతాధికారులు పర్యవేక్షించాలి..



హస్తినాపురంలోని నాగార్జునసాగర్ రోడ్డుపై వేస్తున్న డివైడర్ల నిర్మాణంలో జరుగుతున్న నాసిరకం పనులను పర్యవేక్షించకుండానే అధికారులు, కాంట్రాక్టర్లు నిధులను పంచుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. నాసిరకం పనులతో కొన్నాళ్లకే కూలుపోయే ప్రమాదం ఉంది. క్యూరింగ్ చేయకుండానే ఎవరికీ కనబడకుండా వెంటనే రంగులు వేస్తున్నారు. ఈ డివైడర్ల నిర్మాణంలో జరుగుతున్న అవకతవకలపై ఉన్నతాధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలి.

–చెన్నోజు శ్రీనివాసులు, హస్తినాపురం

ప్రమాదాల నివారణకు డివైడర్లు దోహదం..

హస్తినాపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు డివైడర్లు ఎంతగానో ఉపయోగ పడుతాయని ఈ పనులను నాణ్యతాప్రమాణాలతో పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నందనవనంకాలనీలో చేపడుతున్న డివైడర్ పనులను ఆమె పరిశీలించి మాట్లాడా రు. ప్రధాన రహదారులపై డివైడర్‌ను మధ్యలో వదిలివేయకుండా సిగ్నల్ వద్దే వాహనా లు యూటర్న్ తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వివిధ కాలనీల ప్రజలు వాహనదారులు, అధికారులు, ప్రజాప్రతినిధు ల సూచనలు పాటిస్తూ డివైడర్ మధ్యలో నుంచి వెళ్లకుండా సిగ్నల్ దగ్గర నుంచి మాత్రమే వెళ్లాలన్నారు. డివైడర్ల పనుల్లో నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్పొరేటర్ వెంట ఏఈ మల్లికార్జున్‌గౌడ్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న సుజాతనాయక్

నేడు ట్రాన్స్‌జెండర్స్ 'ఆధార్' కౌంటర్ ప్రారంభం

చాదర్‌ఘాట్: రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌జెండర్స్‌కు ఆధార్ కార్డుల జారీ కేంద్రాన్ని మంగళవారం (నేడు)మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవనంలో ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ హాజరవుతారన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.39, వంకాయ రూ.35, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.50, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.25, క్యారెట్ రూ.40, దొండ రూ.37, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.35, సొరకాయ రూ17, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.65, అర్వి రూ.40, మునగ రూ.70, చిలుకడ దుంప రూ.60, బీట్‌రూట్ రూ.31, కీర రూ.21, బీన్స్ రూ.125, క్యాప్సికమ్ రూ.75. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

1న సదర్ మేళా

చంచల్‌గూడ: చంచల్‌గూడ ప్రధాన రోడ్డులో వచ్చే నెల 1న ఉప్పరిగూడ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ మేళా ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వైస్ చైర్మన్ నిరంజన్‌యాదవ్ అన్నారు. స్థానిక రామాలయంలో సదర్ ఉత్సవ నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. నిజాం కాలంలో కూడా యాదవ కులస్తులు పెద్ద ఎత్తున సదర్ ఉత్సవాలు నిర్వహించే వారన్నారు. దున్నపోతుల ప్రదర్శన సాయంత్రం 5 గంటలకు ప్రారంభం అవుతుందని, యాదవులు తమ దున్నపోతులను సకాలంలో ప్రదర్శనకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంపత్‌యాదవ్, వెంకటరామ్‌పాల్ యాదవ్, రాజుయాదవ్, ధన్‌రాజ్‌యాదవ్, అనిల్‌యాదవ్, పెరిక శ్రీనివాస్, రాహుల్‌కిషోర్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో 8 ఫిర్యాదులు

ఎల్‌బీనగర్: హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 8 ఫిర్యాదులు వచ్చినట్లు సర్కిల్ డీసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు. ఇంజినీరింగ్‌పై-4, టౌన్ ప్లానింగ్‌పై-2, ఆస్తిపన్ను పై-1, వెటర్నరీపై-1 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు నిల్

చాదర్‌ఘాట్: ప్రజావాణిలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్ తెలిపారు. దాదాపు అన్ని ఫిర్యాదులు ఆన్‌లైన్‌లోనే చేస్తున్నారని తెలిపారు. ప్రజావాణిలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి పాటు పడాలి



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్‌ఆర్, ఎమ్మెల్సీ దయానంద్

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కేపురం డివిజన్ పరిధి ఖిల్లా మైసమ్మ అమ్మవారి దేవాలయం నూతన కార్యవర్గం చైర్మన్, ధర్మకర్తలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్, దేప భాస్కర్‌రెడ్డి, నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కుంచారపు సురేంద్ర కుమార్ (సురేష్) ధర్మకర్తలు వెంకటాచార్యులు, కేతావత్ రాజు నాయక్, ఏల్లికంటి శ్రీశైలం, చిలుకూరి లక్ష్మీ, అమృత, పగడాల శ్రీశైలం, సందీప్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ ప్రతిష్ఠ, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ పాలకవర్గ సభ్యులందరూ సమష్టి నిర్ణయాలతో ఆలయ అభివృద్ధికి పాటు పడాలన్నారు. చైర్మన్ మాట్లాడుతూ.. పెద్దలందరి సలహాలు సూచనలు స్వీకరిస్తూ అందరి నిర్ణయాలతో ముందుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, మధుసూదన్ రావు, గోవర్ధన్ రెడ్డి, ధనరాజ్ గౌడ్, బాలకిషన్, రవీంద్ర, డక్కీయార్ నాయక్, రమేష్ నేత, భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

31న సదర్ సమ్మేళనం



మాట్లాడుతున్న నిర్వాహకులు

నాగోలు: మన్సూరాబాద్ చౌరస్తాలో ఈ నెల 31న అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పోచబోయిన గణేష్ యాదవ్, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ తెలిపారు. సోమవారం మన్సూరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో జగదీష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, రవియాదవ్, చిట్టి యాదవ్, నాగేష్ యాదవ్, యాదయ్య యాదవ్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

మా డబ్బులు మాకివ్వండి



కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

నాగోలు: ప్లాట్ల పేరుతో డబ్బులు కట్టించుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా ఇచ్చిన చెక్కులు బౌన్స్ అవుతున్నాయని, కార్యాలయానికి వస్తే ఎవరు పట్టించుకోవడం లేదని బాధితులు సోమవారం ఎల్‌బీనగర్ కామినేని సమీపంలోని స్పెక్ట్రా రియల్ ఎస్టేట్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. వివిధ ప్రాంతాల బాధితుల నుంచి స్పెక్ట్రా యాజమన్యం యాదగిరిగుట్ట, చౌటుప్పల్, షాద్‌నగర్‌లో ప్లాట్లు ఇస్తామని డబ్బులు కట్టించుకొని రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తమ డబ్బులు ఇవ్వాలని కోరగా గతంలో కొందరికి చెక్కులు ఇవ్వగా అకౌంట్‌లో డబ్బులు లేకపోవడంతో బౌన్స్ అయ్యాయన్నారు. కార్యాలయానికి వచ్చి అడిగితే పట్టించుకోకపోవడంతో సోమవారం ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు బాధితులను పంపించే ప్రయత్నం చేశారు. ప్లాట్ల పేరుతో మోసం చేసిన వారిని వదిలేసి మమ్మల్ని పంపించే ప్రయత్నం చేయడం ఏంటని పోలీసులను ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఎండీ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చి బాధితులతో మాట్లాడి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో బాధితులు వెళ్లిపోయారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న పవన్

సైదాబాద్: రక్తదానం ప్రాణదానంతో సమానమని దర్శనం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దర్శనం పవన్ అన్నారు. సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని వినయ్‌నగర్ కాలనీలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం ఆరోగ్యానికి కూడా మంచిదన్నారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు స్వాతి, జ్యోతిర్మయి, మహేష్, నవీన్, సాయి ప్రణీత్, రోహిత్, రాహుల్, శివ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు చర్యలు



ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సామనగర్‌లో రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సోమవారం హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, ఏఈ నరేందర్‌తో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. వరద నీరు సాఫీగా పారేలా లేవల్స్ చూసి రోడ్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని త్వరలో ప్రణాళిక రూపొందించి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీవాసులతో మాట్లాడుతున్న నవజీవన్‌రెడ్డి

లింగోజిగూడ: కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు.మార్నింగ్ వాక్‌లో భాగంగా సోమవారం డివిజన్ పరిధిలోని రామకృష్ణ నగర్‌లో కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. కాలనీలో రోడ్లు, విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. నాయకులు పల్సాని జీవన్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్,యాదగిరి, కాశీపతి పాల్గొన్నారు.

నెల రోజుల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న పెండింగ్ పనులను నెల రోజుల్లో పూర్తి చేస్తామని మార్కెట్‌శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన వ్యవసాయ మార్కెట్‌లోని నూతన గ్రేడ్-1 కార్యాలయాన్ని సందర్శించి మాట్లాడారు. వే బ్రిడ్జి కోసం టెండర్లను పిలవాలని, అదే విధంగా రైతుల విశ్రాంతి భవనంలోని పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎస్‌జీఎస్ కార్యాలయాన్ని రెనివేషన్ చేయాలని అందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆయన వెంట రీజనల్ డైరెక్టర్ ఎం.మల్లేషం, ఎస్‌జీఎస్ దామోదర్, గ్రేడ్-1 అధికారి చిలక నర్సింహారెడ్డి ఉన్నారు.

ఘనంగా గణపతి హోమం

చంచల్‌గూడ: సంకష్ట చతుర్థి సందర్భంగా కుర్మగూడ డివిజన్ ఇష్కల మఠం హనుమాన్ దేవాలయంలో సోమవారం గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గణపతి విగ్రహానికి మహాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి నెల సంకష్ట చతుర్థి రోజు క్రమం తప్పకుండా హోమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

ఆస్తి పన్ను టార్గెట్ రూ.42.14 కోట్లు

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్-6కు 2024-25కు ఆస్తిపన్ను రూ. 42.14 కోట్లు వసూలు చేయాలని అధికారులు ఆదేశించారని డీసీ జయంత్ తెలిపారు. ఇప్పటి వరకు రూ.20 కోట్లు వసూలయ్యాయని మిగతావి త్వరలో పూర్తి చేస్తామన్నారు.

మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయం తరలింపు

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో ఉన్న మలక్‌పేట సర్కిల్-6 కార్యాలయాన్ని అక్బర్‌బాగ్ డివిజన్ బీ-బ్లాక్‌లోకి తరలించారు. సర్కిల్ కార్యాలయంలో ఉన్న మానసిక వికలాంగులకు ఫిజియోథెరపీ సెంటర్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఫిర్యాదు రావడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అక్బర్‌బాగ్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు.

చెట్ల పెంపకంలో సూర్యనారాయణ పాత్ర కీలకం

హస్తినాపురం: పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం విషయంలో డాక్టర్ సూర్యనారాయణ ఎనలేని కృషి చేశారని సెంటర్ ఫర్ సోషియోకల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ కమిటీ సెక్రటరీ సన్నీ హెరాక్లియస్ అన్నారు. సోమవారం డాక్టర్ సూర్యనారాయణ పార్థివ దేహానికి నివాళులర్పించిన అనంతరం హెరాక్లియస్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో కాలనీలు, బస్తీల్లో వేలాది మొక్కలను పెంచారన్నారు. పంచాయతీరాజ్ టీచర్స్‌కాలనీలో హైకోర్టు జడ్జిలను ఆహ్వానించి విద్యార్థులకు మొక్కల పెంపకం, చెట్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారని గుర్తు చేశారు.

ఆటోలో మర్చిపోయిన బ్యాగు అప్పగింత

చాదర్‌ఘాట్: ఆటోలో మర్చిపోయిన బంగారు నగలు ఉన్న బ్యాగులను తిరిగి అప్పగించిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వివరాల ప్రకారం.. అక్బర్‌బాగ్‌కు చెందిన అయేషా (50) డబీర్‌పురా నుంచి అక్బర్‌బాగ్‌కు ఆటోలో వచ్చింది. కాసేపటి తర్వాత వెంట తెచ్చుకున్న సామగ్రి చూసుకోగా బంగారు నగలు ఉన్న బ్యాగు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాల ద్వారా ఆటోను గుర్తించి 15 తులాల బంగారు ఆభరణాల బ్యాగును స్వాధీనం చేసుకొని బాధితురాలికి అప్పగించారు.